క్లుప్తంగా

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

వేమూరు: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం నుంచి శనివారం వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు మండల పరిషత్ అధికారి శేష గిరిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం 10 గంటలకు శిక్షణ ప్రారంభం అవుతుందని తెలిపారు.

11న అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



భట్టిపోలు: భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, భక్త బృందం బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆ రోజు స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, నాగవల్లీ దళాలతో విశేష అర్చన, అఖండ కర్పూర హారతి వంటి కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోండి



బాపట్ల: తపాలా శాఖ అందించే వివిధ రకాల పొదుపు ఖాతాలను, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హెడ్ పోస్టుమాస్టర్ సత్యనారాయణ కోరారు. తద్వారా అధిక ఆదాయాన్ని పొందాలని సూచించారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖకు సంబంధించిన సేవలను వినియోగించుకోవాలని బుధవారం ర్యాలీ చేపట్టారు. సేవల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. పొదుపు ఖాతాల్లో పెట్టుబడులు ప్రజలకు ఎంతో సురక్షితంగా ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఫోరం సభ్యుడు డాక్టర్ పి.సి.సాయిబాబు, అసిస్టెంట్ పోస్టుమాస్టర్లు జిలాని, సుజాత సిబ్బంది పాల్గొన్నారు.

గంటా కోటేశ్వరమ్మకు నేతల నివాళి



బాపట్ల: కాంగ్రెస్ పార్టీ బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు గంటా అంజిబాబు మాతృమూర్తి కోటేశ్వరమ్మ(85) వృద్ధాప్యంతో బుధవారం మృతి చెందారు. పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు, అభిమానులు వచ్చి కోటేశ్వరమ్మ భౌతికకాయానికి నివాళి అర్పించారు. సంతాపం తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు గెంౖడెడ్డి శివ, మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తెనాలిరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి దయాకర్ రెడ్డి అన్నారు. బీజేపీ తెనాలి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం తెనాలిలో నిర్వహించారు. దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకి అంకితభావంతో పనిచేసి కార్యకర్తలు ఉండటం బీజేపీ అదృష్టమన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కేంద్ర పథకాలు తెలుసుకొని ప్రజలకు వివరించాలని, పింఛన్ పంపిణీలో పాల్గొనాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ మాట్లాడుతూ విశ్వకర్మ పథకం, ఉచిత బియ్యం, ఎయిమ్స్ హాస్పటల్ గురించి ప్రజలకు చెప్పాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి టి.రామకృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కటారి వసుదేవ నాయుడు, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి గాజుల వెంకయ్య నాయుడు, తెనాలి ఇన్‌చార్జి చుండూరు ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు, మండల అధ్యక్షుడు కడియాల నందకిషోర్, కొల్లిపర మండల అధ్యక్షుడు మునగాల కృష్ణమూర్తి, అధికార ప్రతినిధి టి.అనంతాచార్యులు, టి.రఘు, దారా సాయిగుప్త, రవీంద్ర, నాగరాజ్, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలి రూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెదరావూరు గ్రామానికి చెందిన కరపాల చిన్న(45) వ్యవసాయ పనులు చేస్తూంటాడు. కుటుంబ కలహాల కారణంగా గత నెల 27న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

రేపల్లె రూరల్: కృష్ణానదికి వరద ఉధృతి నేపథ్యంలో పరివాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు సూచించారు. కృష్ణా బ్యారేజీ వద్ద బుధవారం భారీగా నీరు విడుదల చేయటంతో ఆయన మండలంలోని పెనుమూడి పల్లెపాలెం గ్రామాన్ని సందర్శించారు. ప్రజలతో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఉంటే వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వరద పెరిగే అవకాశం ఉన్నందున కృష్ణానదిలోకి వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు సూచించారు. గొర్రెలు, మేకలు, ఇతర పశువులను మేపుకొనేందుకు నదిలోని లంక భూముల్లోకి వెళ్లరాదని చెప్పారు. గతంలో చోటుచేసుకున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని తీరంలో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకుగానీ, ప్రభుత్వం నిర్వహించే పునరావాస కేంద్రాలకుగానీ వెళ్లాలని పేర్కొన్నారు. గ్రామాలలోని రెవెన్యూ సిబ్బంది నదిలో నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉన్నతాధికారులకు తెలియజేయాలని చెప్పారు. త్వరలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు పరిధిలో...

భట్టిప్రోలు: కృష్ణా నది పరివాహక లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు సూచించారు. బుధవారం భట్టిప్రోలు మండలం పెదలంక కాకులడొంక రేవును ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ శాఖతోపాటు పోలీస్, పంచాయతీరాజ్, అగ్నిమాపక దళ, ఆర్‌సీ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నదిని ఆనుకుని ఉన్న గ్రామాలైన ఓలేరు పల్లెపాలెం, పెదలంక, పెసర్లంక, చింతమోటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో టి.ఉషారాణి, వీఆర్వోలు మంద్రు జక్రయ్య, శివరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి పుష్పలత, ఇతర సిబ్బంది ఉన్నారు.



పల్లెపాలెంలో గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్న తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు

కొల్లూరు పరిధిలో...

కొల్లూరు: కృష్ణా నది మధ్యలోని ద్వీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని కొల్లూరు తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఆయన నది మధ్యలో ఉన్న మండలంలోని పోతార్లంక శివారు రావిలంక, ఈపూరులంక తదితర గ్రామాలలో పర్యటించారు. ముందస్తు జాగ్రత్తలపై ప్రభుత్వ శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అర్ధరాత్రి సమయంలో నదిలోకి నీరు వచ్చి చేరే సూచనలు ఉన్నాయన్నారు. తీర గ్రామాలలోని ప్రజలు అధికారులు సూచించే జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. వరద తీవ్రత పెరిగే అవకాశం ఉంటే ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను కొల్లూరు, దోనేపూడి, చిలుమూరు గ్రామాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలిస్తారని చెప్పారు. లేని పక్షంలో ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలన్నారు. తక్షణం గర్భిణులు, వృద్ధులు, చిన్నారులను పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రోడ్డు మార్గంలేని పోతార్లంక శివారు రావిలంకలో ఉంటున్న 27 కుటుంబాలలోని 38 మందిని కలిసి వరద తీవ్రత పెరగక ముందే నది దాటి రావాలని సూచించారు. వారు పశువులు సహా బయటకు వచ్చేందుకు అంగీకరించారు.



భట్టిప్రోలు కాకులడొంక రేవు వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న తహసీల్దార్



ఈపూరులంకలో వరదలపై అధికారులకు సూచనలిస్తున్న కొల్లూరు తహసీల్దార్

యంత్రాల వినియోగంతో తగ్గనున్న సాగు ఖర్చు



మాట్లాడుతున్న నాబార్డు మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు

బాపట్ల: వ్యవసాయ యాంత్రీకరణతో ఉత్పాదక ఖర్చు తగ్గించవచ్చని నాబార్డు మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు పేర్కొన్నారు. మండలంలోని జమ్ములపాలెం గ్రామంలో ప్రాణాధార కార్యాలయంలో ఏర్పాటైన మూడు రోజుల సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వపరమైన సాయం అందిపుచ్చుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వరి యాంత్రీకరణ కోసం మలేషియాలో ఆరువేల ఎకరాల భూమిని ప్రాణాధార సంస్థకు అప్పగించటం ఎంతో సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన యంత్రాలను రైతులు పరిశీలించారు. మహ్మద్ ఆరీఫ్, డాక్టరు అశోక్‌కుమార్, హుసేన్, రఫీ, యుగంధర్, పుండరీకాక్షులు, కారుమంచి ప్రసాద్, నూతలపాటి బాబు, పువ్వాడ బసంత్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



భట్టిప్రోలు: మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గ్రామాల్లో జ్వరాలు ప్రబలే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. బుధవారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని రైలుపేటలో దోమల నివారణకు చేపట్టిన కార్యక్రమంలో సర్పంచి దారా రవికిరణ్మయి పాల్గొన్నారు. సర్పంచి మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ముఖ్యంగా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

తల్లిపాల ఆవశ్యకతపై ప్రచారం అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న శివపార్వతి తదితరులు



మత్తివారిపాలెంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ భావన

బాపట్ల: తల్లిపాల ఆవశ్యకతపై నిరంతర ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందని బాపట్ల సీడీపీఓ శివ పార్వతి అన్నారు. బుధవారం పట్టణంలోని 17వ వార్డు అక్బర్‌పేటలో కోడ్ నెంబర్ 216 అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా కొందరు తల్లులు తమ బిడ్డలకు పోతపాలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇది బిడ్డల ఎదుగుదలకు, వారి వ్యాధి నిరోధక శక్తికి తీవ్ర ఆటంకం కలిగిస్తుందని చెప్పారు. అమృతం వంటి తల్లి ముర్రుపాలు బిడ్డకు పట్టించడం తల్లీబిడ్డల ఆరోగ్యానికి క్షేమకరమని తెలిపారు. ప్రధానంగా బాలింతలకు ముర్రుపాల ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. ముగింపు ర్యాలీని అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహించారు. అనంతరం బాలబాలికలకు బాలామృతం, గర్భిణులు, బాలింతలకు బియ్యం, కందిపప్పు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శేషుకుమారి, అంగన్వాడీ కార్యకర్త హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో ...

కర్లపాలెం: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమైనవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, నాగమల్లేశ్వరి తెలిపారు. బుద్ధాం సెక్టార్ సూపర్‌వైజర్ సౌజన్య ఆధ్వర్యంలో తిమ్మారెడ్డిపాలెంలో కర్లపాలెంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ప్రతి బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలే తాగించాలని, డబ్బా పాలు వద్దని సూచించారు. బాలింతలకు, గర్భిణులకు ఈ మేరకు అవగాహన కల్పించారు. కర్లపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి పర్యవేక్షించారు. అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

సూరేపల్లిలో...

సూరేపల్లి(భట్టిప్రోలు): తల్లి పాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఫజురున్నీసా తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం భట్టిప్రోలు మండలం పల్లెకోన సెక్టార్ పరిధిలోని సూరేపల్లి అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫజురున్నీసా మాట్లాడుతూ బిడ్డకు డబ్బా పాల కన్నా తల్లిపాలు ఎంతో మంచివని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి మోర్ల విజయలక్ష్మి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీలత, ఏఎన్ఎం ఎం. అరుణజ్యోతి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పి. విజయమణి, ఎం. రోజీకమల, వై.జయప్రద, యు.సంతోషం, కె.విజయకుమారి, ఐ.లక్ష్మి సుధ, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లిపాలెంలో...

నగరం: ప్రతి తల్లి తన బిడ్డలకు తప్పనిసరిగా పాలు ఇవ్వాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్. బాబురావు చెప్పారు. మండలంలోని ఉల్లిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో బాబురావు మాట్లాడుతూ.. తల్లిపాలే బిడ్డలకు శ్రీరామరక్ష అన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని కోరారు.

కొల్లూరు పరిధిలో...

కొల్లూరు: తల్లిపాలతో బిడ్డల ఆరోగ్యం బాగుంటుందని ఐసీడీఎస్ కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా కొల్లూరు ఎస్సీ కాలనీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. పలు అంశాలలో గర్భిణులు, బాలింతలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

■ మండలంలోని చినపులివర్రులో దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ నగరాజకుమారి సిబ్బందితో కలిసి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహనా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తల్లిపాల వల్ల బిడ్డలకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తివారిపాలెంలో...

చెరుకుపల్లి: ప్రతి బాలింత తప్పనిసరిగా బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలను ఇవ్వాలని కనగాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ భావన అన్నారు. బుధవారం మండల పరిధిలోని తూర్పుపాలెం పంచాయతీ మత్తివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి డాక్టర్ భావన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, తల్లులతో పాలిచ్చే సంస్కృతిని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, సాయి తేజ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చినపులివర్రులో అవగాహన ప్రదర్శన



సూరేపల్లిలో మాట్లాడుతున్న ఫజురున్నీసా



కొల్లూరు ఎస్సీ కాలనీ ప్రాంతంలో తల్లులకు బహుమతులు అందిస్తున్న విజయలక్ష్మి

ఘనంగా చేనేత దినోత్సవం

భట్టిప్రోలు: చేనేత కార్మికులు ఐక్యంగా పోరాడాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి. బాలాజీ కోరారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద బుధవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తక్కువ మొత్తం చేనేతకు కేటాయించడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమ రక్షణకు, కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు కె. రామకోటేశ్వరరావు, చేనేత కార్మికులు కె. వీర మోహన్‌రావు, కె. పార్థసారథి, వి. ఆంజనేయులు, టి.రఘురామ్ ప్రసాద్, వి. శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: నేతన్నకు ఎప్పుడూ అందరూ రుణపడి ఉంటారని ఇసుకపల్లి చేనేత సహకార సంఘం మేనేజర్ కే.శోభనబాబు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. అనంతరం చేనేత కార్మికులు గుర్రం వెంకటేశ్వరరావు, కారంపూడి రామారావు, ఎ.వెంకట సుబ్బమ్మ, బట్టు మహాలక్ష్మిలను సత్కరించారు. తొలుత నాయకులు ప్రగడ కోటయ్య, కొతరపు వెంకట సుబ్బారావు, కొతరపు వీరరాఘవయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకురాతి గంగమ్మ, సంఘ మాజీ అధ్యక్షుడు కొతరపు వెంకట నాంచారావు, పాలకేంద్రం సెక్రటరీ ఎ.వీరశంకర్, పాలకవర్గ సభ్యులు శ్రీనివాసరావు, సుబ్బారావు, గోవిందరావు, కొర్నిపాటి శివకోటేశ్వరి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో చేనేత జెండా ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు



ఇసుకపల్లిలో చేనేత కార్మికులను సత్కరిస్తున్న సభ్యులు

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు నలుగురు బాలికలు

చెరుకుపల్లి: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పొన్నపల్లి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి నలుగురు బాలికలు ఎంపిక కావటం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపల్ నర్గీస్ క్వాజి అన్నారు. స్కూల్ ఆవరణలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఇటీవల వెదుళ్ళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్ 14 విభాగంలో నిర్వహించిన ఎంపికలో ఈ బాలికలు ఎంపికైనట్లు గుర్తుచేశారు. కె.షణ్ముక ప్రియ, జి.హారిక, కె.లిఖిత, ఆర్. శశికళ ఎంపికైనందుకు అభినందించారు. ఆగస్టు 10, 11వ తేదీలలో చిత్తురు జిల్లా కుప్పంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. బాలికలను పాఠశాల చైర్మన్ పైనం ఏడుకొండల రెడ్డి, వైస్ చైర్మన్ సాయి గణేష్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వైస్ చైర్మన్ సాయి గణేష్ రెడ్డి

మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు

రేపల్లె రూరల్: మత్తు పదార్థాలు తీసుకోవటం వల్ల అనేక అనర్థాలు తప్పవని ఐఆర్ఈఎఫ్ విద్యాసంస్థల డిప్యూటీ డైరెక్టర్ జాన్ రెబ్బా తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆదేశాల మేరకు ఐఆర్ఈఎఫ్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని రేపల్లె క్రిస్టియన్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచిగా చదువుకోవాలని కోరారు. కార్యక్రమలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జాన్ రెబ్బా

బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలి

డివిజన్ స్థాయి అవగాహన సదస్సులో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి: బాల్య వివాహాల నిరోధానికి చిత్తశుద్ధితో కృషిజరగాల్సి ఉందని తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటూనే, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు, పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తెనాలి డివిజన్, మండల స్థాయిలో బాల్య వివాహ నిరోధక చట్టం-2023పై స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో అవగాహన సదస్సును నిర్వహించారు. గుంటూరు జిల్లా మహిళా శిశు అభివృద్ధి ఏజెన్సీ సహకారంతో ఏర్పాటైన సమావేశానికి మంగళగిరి సీడీపీఓ ఎ.సులోచన అధ్యక్షత వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలను నిర్మూలించే విషయంలో సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు అందరికీ బాధ్యత ఉంటుందని చెప్పారు. జిల్లా శిశు రక్షణ అధికారి సీహెచ్ విజయకుమార్ మాట్లాడుతూ, చిన్న వయసులో వివాహాల నిర్మూలన చట్టం-2023 గురించి అవగాహన కల్పించారు. లీగల్/ప్రొఫెషన్ అధికారి బి.వాసంతి మాట్లాడుతూ తప్పనిసరి వివాహ నమోదు చట్టం-2022, అలాగే నియమాలు-2023 గురించి వివరించారు సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త కె.సమీర్‌కుమార్ మాట్లాడుతూ బాలల హక్కులకు రక్షణ కల్పించే విధానంలో సీడీపీఓల పాత్రను వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో తెనాలి మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ నిర్మల, చిన్న వయసులోనే జరిపించే వివాహాలను అరికట్టటంలో తమ సహకారం ఉంటుందని తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, తెనాలి ఎంపీడీవో శిల్ప తెలియజేశారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తే బాల్య వివాహాలను అరికట్టటం సాధ్యపడుతుందని బుధవారం ఇక్కడ జరిగిన సమావేశంలో అధికారులు ఏకాభిప్రాయానికి వచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ నిర్మల, తెనాలి, పొన్నూరు సీడీపీఓలు డాక్టర్ ఎం.సునీత, ఎస్. వెంకటరమణ, తెనాలి రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, శిశుసంక్షేమ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

11న ఆర్యవైశ్య యువజన సంఘం ప్రమాణస్వీకారం

తెనాలి: గుంటూరు జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ యూత్, తెనాలి నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఈనెల 11వ తేదీన తెనాలిలో నిర్వహించనున్నారు. ఈనెల 11వ తేదీన స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరగనున్న ప్రమాణస్వీకారోత్సవ ఆహ్వాన పత్రికను బుధవారం సాయంత్రం వ్యవస్థాపక కార్యదర్శి కొప్పురావూరి హరికిషోర్ ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి టీజీ భరత్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీ ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు సుబ్బారాయుడు పాల్గొంటారని తెలిపారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన హరికిషోర్